


## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

• ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జనవరి 12: యువత, విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. టోర్నీ నిర్వాహకులను అభినందించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, నిర్వాహకులు క్రాంతికుమార్, ముజామిల్, నాయకులు ఎండీ యాసిన్, కొండాల్‌రెడ్డి ఉన్నారు.

## హుజూరాబాద్ కాంగ్రెస్‌లో 'ఫ్లెక్సీ' చిచ్చు



గుడిపాటి జయపాల్ రెడ్డి శనివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

హుజూరాబాద్ టౌన్, జనవరి 12: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుడు, జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జయపాల్ రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పార్టీలో చిచ్చు రేపింది. 'సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హుజూరాబాద్ ప్రజలు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్, మంత్రులు డీ శ్రీధర్ బాబు, పొన్నం, సీతక్క, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫొటోలతో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇందులో హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఫొటో లేకపోవడం పెద్ద చర్చకు దారి తీసింది. శనివారం ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో జయపాల్‌డ్డి పోలీసులను ఆశ్రయించారు. తాను సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీని ఎవరు తొలగించారో..? గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కాగా, ఫొటో పెట్టని కారణంగా ప్రణవ్ బాబు వర్గానికి చెందిన వారే తొలగించి ఉంటారని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే కేవలం ఇది ప్రైవేటు ఫ్లెక్సీ అని, దీనికి పార్టీతో సంబంధం లేదని, ఇష్టమైన వ్యక్తుల ఫొటోలు పెట్టుకునే స్వేచ్ఛ ఉందని జయపాల్ రెడ్డి పేర్కొన్నారు.



ఆదివారం ఖాళీగా కనిపిస్తున్న హోర్డింగ్

# సంక్రాంతి సంబురాలకు రెడీ

- పట్టణాల నుంచి పల్లెలకు చేరుకుంటున్న ప్రజలు
- నేడు భోగి.. రేపు సంక్రాంతి.. ఎల్లుండి కనుమ

పెద్దపల్లి కమాన్, జనవరి 12 : సంక్రాంతి సంబురాలకు పల్లెలు సిద్ధమయ్యా యి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పల్లెల్లో పండుగ శోభ సంతరించుకుంది.. మూడు రోజుల వేడుకలకు పట్టణాల్లో స్థిరపడ్డ ఉద్యోగులు, వ్యాపారస్తులు, అధికారులు పల్లె బాటపట్టారు. పుట్టిన ఊరు కన్నతల్లి లాంటిదని.. సొంతూరిపై మమకారంతో పిల్లా పాపలతో కుటుంబమంతా కలిసి స్వగ్రామాలకు చేరుకున్నారు.. సోమవారం భోగి వేడుకలు, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకోనున్నారు. గ్రామాల్లోని రైతులు పండించిన పంటలు చేతికొంది.. ధనధాన్యాలతో ప్రతి ఇల్లు సంతోషాలతో కళకళలాడుతోంది. పల్లెల్లో ఎక్కడ చూసి స్నేహితులు, బంధువుల గుమిగూడి ముచ్చట్లు మునిగితేలడం కనబడుతోంది. పందెం కోళ్ల కొట్లాటలు.. పతంగుల ఎగురవేతలు..హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. మకర సంక్రాంతి పండుగ ప్రత్యేకత.

**పల్లెటూరి అందాలను ఆస్వాదించేందుకు..**

హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాల్లో బిజీ జీవనం గడిపే ఉద్యోగులు, వ్యాపారులు ఏడాది కోసారి పల్లెటూర్లలోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలని సొంతూర్లకు చేరుకున్నారు. వారం రోజులు పల్లెటూర్లలో గడిపితే మానసికోల్లాసంతో పాటు ఒత్తిడి తగ్గుతుందనే ఉద్దేశ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థిని, విద్యార్థులు తమ ఇండ్లకు వచ్చి చిన్ననాటి స్నేహితులను కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ కాలాక్షేపాలు చేస్తున్నారు. చిన్నారులు అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో సరదా ఆటలాడుకుంటున్నారు. సంక్రాంతికి ప్రతి ఇంటా వివిధ రకాల పిండివంటకాలు చేసుకోవడం ఆనవాయితీ. సకినాలు, గారెలు, లడ్డూలు, కారపూస తదితర రుచికరమైనవి వంటకాలను ఇప్పటికే తయారు చేశారు.

**మూడు రోజుల ముచ్చటైన వేడుక..**

ఇది మూడు రోజుల ముచ్చటైన పండుగ. మొదటి రోజు భోగి పండగను జరుపుకుంటున్నారు. ఉదయమే చిన్నా పెద్దలు భోగి మంటలు వేసి, ఇంట్లో ఏమైనా పాత వస్తువులుంటే అందులో వేస్తారు. మనలోని చెడు భావాలని మంటల్లో కాల్చాలని పెద్దలు చెబుతుంటారు. ఇండ్ల వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి, వాటిలో ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెలు పెట్టి నవధాన్యాలు పోస్తారు. మరునాడు మకర సంక్రాంతి వేడుకను చేసుకుంటారు. ప్రత్యేక శోభ ఉట్టిపడేలా ఇండ్లను అలంకరించుకుని, ముగ్గులతో ముంచెత్తుతారు. వాటిల్లో గొబ్బెలు పెట్టి పూలు, పండ్లు, నవధాన్యాలు పోసి, పూజలు చేశారు. తర్వాతి రోజు కనుమ పండుగ. దీనినే పశువుల పండుగ అని అంటారు. కనుమ రోజు రైతులు తమ పశువులకు స్నానం చేయించి, పూలతో అలకరించి పూజలు చేస్తారు. పిండివంటలు, ఘుమఘుమలాడే వంటకాలు తయారు చేసుకుని, కుటుంబసభ్యులు, బంధుమిత్రులంతా సంతోషంగా వేడుకను జరుపుకోవడం ఆనవాయితీ..

ఓదెల, జనవరి 12: సంక్రాంతి పండుగ తెలుగింట సంతోసాలను తెస్తుంది. తెలుగు సంస్కృతి, సంప్రాదాయానికి ప్రతిక. వానకాలం పంట రైతుల చేతికి వచ్చిన తర్వాత జరుపుకుంటారు. ఎద్దులు లేనిదే ఒకప్పుడు వ్యవసాయం లేదు. అందుకే రైతులు ఎద్దులను, కచ్చురాలను సంక్రాంతి పండుగకు చెరువుల నీళ్లల్లో కడిగి రంగులు వేసి అందంగా అలంకరించుకుంటారు. గజ్జెలు, దం డలు వేసి, కొమ్ములకు రంగులను పూస్తారు. చిన్నా రి పిల్లలు గాలిలో పతంగులను ఎగరవేసి ఆనందంగా గడుపుతారు. డూ..డూ బసవన్నలు ఇంటింటికి తిరిగి ధాన్యం సేకరించడం వంటి అనేక కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా గడుపుతారు. సోమవారం భోగి పండుగ ఉండ



నాంసానిపల్లెలో ఎడ్లను కడుగుతున్న రైతు

డంతో గ్రామాల్లో రైతులను ఎద్దులను చెరువుల నీటిలో కడుగడం కన్పించింది. సంక్రాంతి పండుగ రోజు ఎద్దులు కొత్త శోభను సంతరించుకోనున్నాయి.

## గుండెపోటుతో జర్నలిస్టు మృతి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన బిగ్ టీవి విలేకరి సిరిశెట్టి చిరంజీవి (49) ఆదివారం గుండెపోటుతో మృతి చెందా డు. ఇంట్లో ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో వెంటనే కుటుంబ సభ్యులు 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్, ప్రధానకార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్, క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు దయానంద్ గాంధీ, డీ మాధవరావు, కేఎస్ వాసు, ముచ్చకుర్తి కుమార్, కూసం శ్రీనివాస్, కేపీ శ్రీనివాస్, మామిడి అశోక్, ఉదయ్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ సభ్యులు చిరంజీవి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే సంతాపం**

గోదావరిఖని, జనవరి 12: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన బిగ్‌టివి విలేకరి సిరిశెట్టి చిరంజీవి(49) ఆదివారం గుండెపోటుతో మృతి చెందగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు గాంధీనగర్‌లోని చిరంజీవి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## భవనాల కూల్చివేతపై స్టేటస్ కో

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని పోచమ్మ మైదానంలో గల భవనాల కూల్చివేతపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రోడ్ల వెడల్పులో భాగంగా భవనాలను కూల్చివేస్తుండగా కొంతమంది యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. సర్వే నం 693 జనగామ శివారులోని 39 గుంటల స్థలంలో నిర్మించిన 9 భవనాలను రోడ్డు వెడల్పు పేరిట కూల్చవద్దని, భవన యజమానులు పోతు రాజుతోపాటు మరో తొమ్మిది మంది హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, మున్సిపల్ డీఎంఏ , అదనపు కలెక్టర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఆర్జీ-1 జీఎం, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వోతోపాటు మరో నలుగురిపై దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ కే లక్ష్మణ్ స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం భవనాల కూల్చివేత యథావిధిగా జరుగుతుందా? లేక తాత్కాలికంగా నిలిపివేస్తారా? అన్నది వేచి చూడాలి.

## 'లక్ష డప్పులు..వెయ్యి గొంతు' విజయవంతం చేయాలి

మంథని, జనవరి 12: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు..వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదిగ సంఘాల నాయకులు మాట్లాడుతూ. ఈ నెల 21న మందకృష్ణ మాదిగ పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వస్తున్న తరుణంలో పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు మాదిగలు, ఉపకులాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమ పోరాట కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## నెలలు గడుస్తున్నా సాగని పనులు

• రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు



కంకర తేలిన బేగంపేట రోడ్

రామగిరి, జనవరి 12 : మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న బేగంపేట ఎక్స్ రోడ్ వెడల్పులో భాగంగా కట్టడాలు కూల్చిన ఆర్ అండ్ బీ అధికారులు ఆక్కడి నుంచి ఉన్న తారురోడ్డును కొద్ది దూరం తవ్వారు. ప్రధాన రహదారి నుంచి వంద మీటర్ల పరిధి వరకు డబుల్ రోడ్ వేస్తామని ఉన్న రోడ్డును తవ్వి నాలుగు నెలలు గడుస్తున్న ఇంత వరకు తిరిగి రోడ్డు మాత్రం వేయలేదు. దీంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డులో దుమ్ము, ధూళితో ప్రయాణికులు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణ నిర్లక్షానికి నిదర్శనంగా నిలుస్తుందని అక్కడి స్థానికులు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి వేంటనే కారకులపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 12: మండలంలోని బ్రాహ్మణపల్లిలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మేకల విజయ్‌కుమార్, పడాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 200 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 12: కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం కరీంనగర్ నియోజకవర్గంలోని సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. రూ.47 లక్షల విలువైన చెక్కులను 200 మందికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మీసేవ వెబ్‌సైట్లతో మోసపోవద్దు

కలెక్టరేట్, జనవరి 12: నకిలీ మీసేవ వెబ్‌సైట్లతో మోసపోవద్దని, సెంటర్ ఏర్పాటు కోసం వెబ్‌సైట్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలంటూ వస్తున్న అసత్యప్రచారాన్ని నమ్మకూడదని జిల్లా ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీరామ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈజీ మనీ లక్ష్యంగా మోసగాళ్లు రెచ్చిపోతున్నారని, మీసేవ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సందేశాలు పంపడమే కాకుండా నకిలీ మీసేవ పోర్టల్‌ను రూపొందించారని వెల్లడించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, సైట్‌ను బ్లాక్ చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నకిలీ వెబ్‌సైట్లకు ఎలాంటి వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని, డబ్బులు చెల్లించి మోసపోవద్దని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.